
# శ్రీమద్భాగవత ప్రశ్నోత్తర మాలిక




## "శ్రీ గురుభ్యో నమః" విద్యార్థిని విద్యార్థుల సేకరణ

**www.gurujnanam.org**

Copyright@gurujnanam.org Disclaimer: This document is not for commercial purpose

# CD# 2-1 to 3-1
# తత్త్వముతో కూడిన క్లిష్టమైన ప్రశ్నలు



1.గోవిందుడు ఎవరు?
జ.వరాహ రూపములో వచ్చి గోరూపములో ఉన్న భూమిని (తెలుసుకున్నవాడు) రక్షించిన వాడు. భూమి ద్వారా తెలియబడుతున్నవాడు గోవిందుడు. "మహావరాహో గోవిందః ".

2.సోమ యాగములు ఎన్ని అవి ఏవి?
జ.అతిరాత్రము, ఆప్తోర్యామం, అగ్నిష్టోమము, అత్యగ్నిష్టోమము, ఉక్థము, షోడసి, వాజపేయం.

3. క్రమముక్తి అంటే ఏమిటి?
జ.ఉపాసనా బలం చేత ఈ జన్మలోనే జీవన్ముక్తులు కాగలరు. అలాకాని పక్షములో ఆ లోపలే ఆయువు పూర్తయితే, వారు సగుణబ్రహ్మలోకానికి చేరుకొని క్రమక్రమముగా ముక్తిని పొందుతారు. దీనినే క్రమముక్తి అంటారు.

4. యజ్ఞము గురించి భాగవత సందేశం ఏమిటి?
జ. యజ్ఞము ఆచరించడము వలన ఈ మానవ శరీరమునకు సార్ధకత ఏర్పడుతుంది. చిత్తశుద్ధి కలిగి వైరాగ్యము, భగవత్ భక్తితో ఇంద్రియ నిగ్రహం కలుగుతుంది. అపుడు ఆ భగవానుడే గురు రూపమును దాల్చి జ్ఞానమును అనుగ్రహిస్తాడు.

5. కర్దముడు తన కన్యలను ఎవరికి ఇచ్చి వివాహము చేసెను?
జ. 1. కళ - మరీచి
2. అనసూయ - అత్రి,

3. శ్రద్ధ -అంగీరస
4.హవిర్భువ -పులస్త్యుడు
5.గతి -పులహనుడు
6.క్రియ- క్రతుడు
7.ఖ్యాతీ -భృగువు
8.అరుంధతి - వశిష్ఠుడు
9.శాంతి - అధ్వర్యుడు.

6.సమదృక్, దృక్ , ప్రత్యక్ అనగా నేమి?
జ.1.సమముగా వ్యాపించిన స్వరూపము,
2. దాని పై సమముగా దృష్టి నిలుపుట,
3.ప్రత్యక్ -బహిర్ముఖం కానీ దృష్టి

7.ఆత్మసంయమ యోగం అంటే ఎమిటి?
జ.జ్ఞాన యోగానికి, భక్తి యోగానికి, కర్మయోగానికి కూడా అష్టాంగ యోగం పనికి వస్తుంది. దీనినే భగవద్గీతలో ఆత్మసంయమ యోగం అంటారు.

8.ఏది కర్మ లోకం, ఏది భోగ లోకం?
జ.భూలోకం కర్మ లోకం, మిశ్రలోకం. ఇక్కడ పాపపుణ్యాలు అనుభవిస్తూ, కర్మలు చేస్తూ, ఆ కర్మల ఫలితాలను తిరిగి పాప పుణ్యాల రూపం లో సమకూర్చుకుంటూ ఉంటాడు జీవుడు.
స్వర్గ/నరకములు భోగ లోకములు. అక్కడ పుణ్య/పాప ఫలితాలు అనుభవించి తీరాల్సిందే.

9.క్రమ ముక్తి అంటే ఏమిటి?
జ.భగవంతుడు నాకు సర్వస్వము అని, భగవంతునిపై ప్రేమతో తదనుగుణమైన యోగములు చేస్తూ, ప్రీతితో ఉపాసన చేసే గృహస్థులు హిరణ్య లోకాలను పొందుతారు. అక్కడ బ్రహ్మ ఆయువు పర్యంతమూ ఉండి, క్రమముగా ముక్తిని పొందుతారు. ఇది దొరకటం సామాన్యము కాదు.

Copyright@gurujnanam.org Disclaimer: This document is not for commercial purpose

10.ఏ ఏ మార్గాల ద్వారా జీవుడు ఆయా లోకాలకి వెళ్తాడు?

జ.1. పాపులకు ప్రత్యేక మార్గము లేదు. అధోమార్గము ద్వారా యమ కింకరులచే నరకాది లోకాలకు వెళతారు.

2. సత్కర్మలు ఆచరించే వారిని, "ధూమ మార్గం" ద్వారా (పొగ) ఉత్తమ లోకాలకు తీసుకువెళతారు దక్షిణాయన, రాత్రి, కృష్ణ పక్ష అభిమాన దేవతలు.

3. యోగులు, ఉపాసకులను, "అర్చిరాది మార్గం" ద్వారా (కాంతి) సగుణ బ్రహ్మ లోకాలకు చేర్చుతారు ఉత్తరాయణ, పగటి, శుక్లపక్ష అభిమాన దేవతలు.

11.గర్భస్థ శిశువుకు గత జన్మల జ్ఞాపకాలు ఎప్పుడు కలుగుతాయి? అప్పుడు ఏమి జరుగుతుంది?

జ.7 వ మాసం లో అవయవ పరిపూర్ణత కలిగాక, ధనురాసనం లో (మెడ మోకాళ్ళ మధ్యలో ) ఉండగా గత జన్మలు గుర్తుకు వస్తాయి. ఇన్ని పొంది వచ్చినా కాలం అన్నీ ఎగరకొట్టేసింది కనుక, ఈ జన్మనైనా నేను సార్ధకం చేసుకుంటాను అనుకుంటాడు శిశువు. కానీ, 10 వ మాసం లో బయటకి వచ్చి పడ్డాక, శరీరం తో తాదాత్మ్యం చెందిపోతాడు.


12.లింగ దేహం ఎలా పనిచేస్తుంది?

జ.అంతఃకరణము, సూమక్ష్మేంద్రియాల కలయికగా ఉన్న లింగదేహము ఇంద్రియాలతోనూ భూతద్దాలతోనూ చూడలేనిది. కళ్ళు ఉండవు కాని దర్శనశక్తి ఉంటుంది. ఈ లింగ దేహాభిమానే జీవుడు. లింగ దేహము వెళ్ళిపోగానే మరణం సంభవించినది అని అంటారు. కర్మ క్షయము అయ్యేవరకు ఇలా ఉపాధులను ఆశ్రయిస్తూ జనన మరణచక్రములో తిరుగుతూనే ఉంటుంది.

13.సునీతి ధృవుడికి నారాయణుని గొప్పతనాన్ని చెప్తూ ఏమిటి బోధ చేసింది?

జ. సునీతి ధృవుడితో, నీ తండ్రి, వారి తండ్రి అయిన స్వాయంభు మనువు, వారి తండ్రి గారైన, బ్రహ్మ దేవుడు, ఉత్తమ స్థానాలలో ఉండడానికి కారణం ఆ నారాయణుని అనుగ్రహమే. అలాగే, ఈ లోకం లో అందరూ కోరుకొనేది సంపద. సంపద, కీర్తి, ధనము, ఆరోగ్యము ఆలా అనేక రూపాల్లో వస్తుంది. ఆ సంపదలకు పేరు లక్ష్మి. ఆ లక్ష్మి దేవి ఆరాధించే దైవం నారాయణుడు. అటువంటి నారాయణుని ఆశ్రయించు అని బోధ చేసింది.

Copyright@gurujnanam.org Disclaimer: This document is not for commercial purpose



14.నారదుడు నారాయణుని ఎలా వర్ణిచాడు?

జ. వక్షస్థలం లో వున్న వాడు, నీల మేఘ శ్యాముడు, వనమాల ధరించిన వాడు, శంఖ చక్ర గదా పద్మములని దాల్చి నటువంటి చతుర్భుజుడు, కిరీటము, కుండలము, కేయూరము ఆది సర్వాభరణాలతో ప్రకాశిస్తున్న వాడు, పీతాంబరం ధరించిన వాడు, బంగారు కంచి మొలలో ధరించిన వాడు, పాదాల దగ్గర రస కాంచన రూపు ఉన్న వాడు, నిర్మలమై, లేత పద్మముల వంటి ఎర్రని కాంతులలో ప్రకాశిస్తూ, మనస్సుకి, కళ్ళకి కూడా ఆనందాన్ని కలిగిస్తున్న పాద పద్మములు కలవాడు, అందమైన తెల్లని గోళ్లు, వాటి కింద అందమైన వేళ్ళు, అంటూ, ఆ విష్ణువుని శిరస్సు నుంచి, పాదాల వరకు వర్ణించాడు.

15.భక్తి ఎన్ని విధములు?

జ. 1. సకామ భక్తి: ధర్మబద్ధమైన కోరికతో భగవంతుని ఆరాధించడం.

2. నిష్కామ భక్తి: వైరాగ్యంతో భగవంతుడే కావాలి అన్న భక్తి.

16.జీవన్ముక్తుడు ఎవడు?

జ. తనలో ఉన్న అఖిల శక్తులు భగవంతుడు తన ప్రకాశంతో ఎలా పట్టుకున్నాడో, అనంతమైన విశ్వంలో - అందరి యొక్క, అన్నిటి యొక్క శక్తుల్ని ఆయన తన యొక్క స్వయంప్రకాశ స్వరూపంతో ధరించి నడుపుతున్నాడు అని తెలుసుకుని, ఆ తెలుసుకునే శక్తి కూడా భగవంతుడే ఇచ్చాడు అని గుర్తించేవాడు.

17. భక్తికి, బ్రహ్మజ్ఞానికి తేడా ఏమిటి?

జ. బ్రహ్మజ్ఞాని = సర్వవ్యాపకమైన బ్రహ్మజ్ఞానం నేను అనే చైతన్య ఎరుక వున్న వాడు

భక్తుడు = నేను అనే అహంకారాన్ని సర్వవ్యాపకమైన బ్రహ్మనికి అర్పించేవాడు.

Copyright@gurujnanam.org Disclaimer: This document is not for commercial purpose

18.ధృవుని కథ వల్ల మనం తెలుసుకోవాల్సిన విషయాలు ఏమిటి?
జ. పాపాలు పోవటానికి యజ్ఞాలు చెయ్యాలి
కోరికలు లేకపోతే, నిష్కామంగా అయినా యజ్ఞాలు చెయ్యాలి
ధర్మబద్ధంగా లభించిన భోగాలను, ధర్మబద్ధంగా అనుభవించాలి (భగవంతుడి ప్రసాద భావంతో)
పాప, పుణ్య ఉభయ కర్మలు పూర్తిగా క్షయం అవ్వాలి (కర్మక్షయం).

19.చాక్షుష మనువునకు అతని భార్య నడ్వలకు కలిగిన సంతానం ఎవరు?
జ. పురువు,కుత్సుడు, త్రితుడు, ద్యుమ్నుడు. సత్యవంతుడు, ఋతువు, అగ్నిష్టోముడు,
అతిరథుడు, ప్రద్యుమ్నుడు, శిబి, ఉల్మలుడు (యజ్ఞములందు పేర్లు).

20.హవిర్ధానుడి యొక్క పుత్రులు ఎవరు?
జ. బర్హిషత్, గయుడు,శుక్లుడు, కృష్ణుడు, సత్యుడు, జితవ్రతుడు.

21.ఖద్యోతము, ఆవిర్ముఖి ద్వారాలు ఏమిటి? స్నేహితుడు ఎవరు? ఏదేశం?
జ. మొదటి ద్వారాలు రెండు కళ్ళు (ఖద్యోతము, ఆవిర్ముఖి)స్నేహితుడు వెలుగు.(ద్యుమంతుడు)
దేశం రూపం. (విభ్రాజితం)

22.పురంజనుడి రథం ఏమిటి?
జ. జ్ఞానేంద్రియాలు: గుర్రాలు
ధర్మాధర్మాలు: చక్రాలు
సత్వ, రజోస్తమోగుణాలు: జెండాలు
ప్రాణ వృత్తులు: కమ్మీలు
కొలబద్ద: సంవత్సరము
కాలగమనం: గమనం

Copyright@gurujnanam.org Disclaimer: This document is not for commercial purpose

23.ప్రియవ్రతుని సంతానం ఎవరు?
జ: 10 మంది; అగ్నీధ్రుడు, ఇధ్మజిహ్వుడు, సబనుడు, మహావీరుడు, హిరణ్యరేతసుడు, కృతపృష్టుడు, మేధాథితి, వీతిహోత్రుడు, యజ్ఞబాహువు, కవి.

24. ప్రియవ్రతుడి మరియొక పత్ని సంతానం ఎవరు; వారి విశిష్టత?
జ: ఉత్తముడు, తామసుడు, రైవతుడు; వీరు ముగ్గురు మూడు మన్వంతరాలకి అధిపతులైయ్యారు.

25.అగ్నీధ్రుడి 9 మంది సంతానం పేర్లన వర్షములు (దేశ) విభజన చేసాడు? అవి ఏమిటి?
జ. నాభి, కింపురుష, హరివృత, ఇలావృత, హిరణ్మయ, రమ్యక, కురు, భద్రాశ్వ, కేతుమాల.

26.ఋషభదేవుడి 9 మంది సంతానం ఆవిష్కరించిన మార్గమే భాగవత మార్గం. వారు ఎవరు?
జ. కవి, హరి, అంతరిక్షుడు, ప్రబుద్ధుడు, పిప్పలాయనుడు, ఆవిర్హోత్రుడు, దృమీళుడు, చమసుడు, కారభాజనుడు.

27.జడ భరతుని గురించి భాగవతంలో ఏమి చెప్పబడింది?
జ. యోగాభ్యాసంతో ఉపాసనతో, క్రమ ముక్తి పొందబోతున్న దశలో ప్రారబ్ధంచేత మొహం కలిగి తపస్సు భగ్నం అయ్యి మరుజన్మ తీసుకుని ఆ జన్మలో క్షయం చేసుకుని తిరిగి పుట్టిన జీవన్ముక్తుని చరిత్ర భాగవతం లో చెప్పబడింది అతనే జడభరతుడు.

Copyright@gurujnanam.org Disclaimer: This document is not for commercial purpose

సర్వం శ్రీకృష్ణచరణారవిందార్పణమస్తు



Copyright@gurujnanam.org Disclaimer: This document is not for commercial purpose